క్లుప్తంగా

ఏఎంసీ చైర్‌పర్సన్‌గా డోలామణి



డోలామణి, కమిటీ సభ్యులను అభినందిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్‌: స్థానిక వ్యవసాయ మార్కెట్‌ కమిటీ (ఏఎంసీ) చైర్‌పర్సన్‌గా బండారులంకకు చెందిన దంగేటి డోలామణి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రిన్సిపల్‌ సెక్రటరీ చిరంజీవ్‌ చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. వైస్‌ చైర్‌పర్సన్‌గా బడుగు మేరీకుమారిని నియమించారు. సభ్యులుగా కాత్రు సునీత, కామన జనార్దనస్వామి, అందే విజయలక్ష్మి, అంగాని సీతా మహాలక్ష్మి, నిమ్మకాయల కోటేశ్వరరావు, చప్పిడి దుర్గారావు, ఈత సత్యనారాయణ, మాచిగిరి కామేశ్వరి, దిడ్ల కాంతారత్నం, నిమ్మకాయల చంద్రశేఖర్‌, దూనబోయిన శ్రీరంగ, పాటి శ్రీరామచంద్రరావు, రంకిరెడ్డి సాంబశివరావు, గోడిలంక పీఏసీఎస్‌ అధ్యక్షుడు, జిల్లా మార్కెటింగ్‌ అధికారి, అమలాపురం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, మున్సిపల్‌ చైర్‌పర్సన్లను సభ్యులుగా నియమించారు. ఈ నేపథ్యంలో డోలామణి, ఆమె భర్త, వైఎస్సార్‌ సీపీ నేత దంగేటి రుద్రప్రసాద్‌ తదితరులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలుసుకుని, కృతజ్ఞతలు తెలిపారు. డోలామణి, రుద్ర దంపతులను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్‌, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, సెంట్రల్‌ డెల్టా బోర్డ్‌ చైర్మన్‌ కుడుపూడి బాబు, సొసైటీ అధ్యక్షుడు దంగేటి బుల్లబ్బులు, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలెపు శ్రీనివాసరావు, ఎస్సీ సెల్‌ రాష్ట్ర కార్యదర్శి సరెళ్ల రామకృష్ణ, వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లను నేడు ప్రారంభించనున్న మంత్రి విశ్వరూప్‌

అమలాపురం టౌన్‌: పట్టణంలోని 13వ వార్డులో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.32 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ శుక్రవారం ఉదయం ప్రారంభిస్తారు. వైఎస్సార్‌ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని ఈ విషయం గురువారం తెలిపారు. ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుతో కలసి నిర్వహించే ఈ కార్యక్రమాలకు పట్టణంలోని మున్సిపల్‌ కౌన్సిలర్లు, కో ఆప్షన్‌ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సూర్య నగర్‌ వార్డు సచివాలయం వద్ద జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్‌ పాల్గొని లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని బులినాని తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌ సీపీలోకి..

కాట్రేనికోన: మండలంలోని గెద్దనపల్లి పంచాయతీ అండపుంత, పోరపేటకు చెందిన టీడీపీ కార్యకర్తలు ఎంపీటీసీ మోత రామలక్ష్మి ప్రోత్సాహంతో వైఎస్సార్‌ సీపీలో చేరారు. అడ్డపుంతకు చెందిన జనిపెల్ల శ్రీనివాసరావు, పోరపేటకు చెందిన చెల్లి వెంకటేశ్వరరావు, పట్టా నరసింహమూర్తి ఆధ్వర్యాన వైఎస్సార్‌ సీపీలో చేరిన పలువురికి ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌ కుమార్‌ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్‌, ఎంపీపీ పాలెపు లక్ష్మీధర్మారావు, వైస్‌ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి ముందుగానే తాళాలు

యానాం: స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామి (మీసాల వెంకన్న) బాలాలయం తలుపులను అర్చకులు ఆరాధన వేళల్లో తెరచి, ముందుగానే తాళాలు వేసేస్తున్నారని గురువారం పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం ఆలయాన్ని ప్రతి రోజూ ఉదయం 5.30 నుంచి 11 గంటల వరకూ భక్తుల దర్శనానికి తెరచి ఉంచాలి. కానీ, ఉదయం దీపారాధన అనంతరం తలుపులు మూసేస్తున్నారని పలువురు చెబుతున్నారు. అలాగే మధ్యాహ్నం స్వామివారికి నివేదన అనంతరం అన్ని తలుపులూ తెరచి, కటకటాలకు మాత్రమే తాళాలు వేస్తున్నారని, ఇది ఆలయ భద్రతకు ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆలయంతో పాటు శివాలయం, పిల్లారాయగుడిలో సైతం హుండీల ఆదాయాన్ని చాన్నాళ్లుగా లెక్కించడం లేదని, అవి నిండిపోయాయని చెబుతున్నారు. ఆలయ నిర్వహణ చూడాల్సిన డిప్యూటీ తహసీల్దార్‌ పుదుచ్చేరి నుంచి కొత్తగా నియమితులయ్యారు. ఆయన పది రోజులైనా విధుల్లో చేరలేదు.

జీతాలివ్వండి

యానాం: తమకు జీతాలు చెల్లించాలని యానాం కో ఆపరేటివ్‌ ఉద్యోగులు ఆర్‌ఏఓ మునిస్వామికి గురువారం వినతిపత్రం సమర్పించారు. కో ఆపరేటివ్‌ యూనియన్‌ అధ్యక్షుడు పువ్వల శ్రీనివాస్‌ మాట్లాడుతూ, తమకు 33 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, దీంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. కనీసం గోనెసంచులు విక్రయించయినా తమకు జీతాలు ఇవ్వాలని కోరామన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక నిరాహార దీక్షకు దిగుతామని అన్నారు.

రేపటి నుంచి ముత్యాలమ్మ జాతర

తాళ్లరేవు: పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఈ నెల 8, 9 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి విళ్ల సత్యనారాయణ గురువారం తెలిపారు. శనివారం అమ్మవారి జాతర, ఆదివారం తీర్థం నిర్వహిస్తామని తెలిపారు.

బైపాస్‌ రోడ్డే డంపింగ్‌ యార్డ్‌



అమలాపురం బైపాస్‌ రోడ్డు చెంత కొబ్బరి బొండాల గుళ్లలు, చెత్త కుప్పలతో ఉన్న దృశ్యం

- అక్కడే చెత్త మూటలు
- తాగి పారేసిన కొబ్బరి బొండాలూ అక్కడే
- దుర్గంధభరితంగా మారుతున్న పరిసరాలు
- చర్యలకు సిద్ధమవుతున్న మున్సిపల్‌ అధికారులు

అమలాపురం టౌన్‌: జిల్లా కేంద్రమైన అమలాపురానికి ఓ కంపోస్ట్‌ యార్డ్‌ ఉంది. పట్టణంలోని చెత్తను రోజూ తరలించేందుకు 12 టిప్పర్లు, 5 ట్రాక్టర్లు ఉన్నాయి. అయినప్పటికీ కంపోస్ట్‌ యార్డ్‌ను ఆనుకుని ఉన్న బైపాస్‌ రోడ్డును కొంతమంది డంపింగ్‌ యార్డ్‌గా మార్చేస్తున్నారు. పట్టణంలో రోడ్ల చెంతన కొందరు ఉదయం నుంచి రాత్రి వరకూ కొబ్బరి బొండాలు విక్రయించి, తాగేసిన బొండాల గుల్లలను సంచుల్లో వేసి బైపాస్‌ రోడ్డు చెంతన విచక్షణా రహితంగా పారేస్తున్నారు. అలాగే, కొంతమంది చిరు వ్యాపారులు, మరికొందరు గోనె సంచులు, సిమెంట్‌, బియ్యం సంచుల్లో చెత్త నింపి ఆ మూటలను ఇష్టానుసారం ఇక్కడే పడేస్తున్నారు. మున్సిపాలిటీలో ప్రతి రోజూ 35 టన్నుల చెత్త వస్తుండగా, బైపాస్‌ రోడ్డు చెంతనే రెండు టన్నులకు పైగా చెత్త తెల్లారేసరికి దర్శనమిస్తోంది. దాదాపు కిలోమీటరు పైగా ఉన్న ఈ బైపాస్‌ రోడ్డులో పంట కాలువ చెంతన డంపింగ్‌ యార్డ్‌ ముఖద్వారం నుంచి నల్లవంతెన వరకూ ఈ చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. దీంతో ఆ రోడ్డుపై ప్రయాణిస్తున్న వేలాది మంది దుర్గంధంతో అవస్థలు పడుతున్నారు.

గతంలో డంపింగ్‌ యార్డ్‌లో చెత్త గుట్టలు పెరిగిపోయినప్పుడు, వేసేందుకు జాగా లేని సమయాల్లో బైపాస్‌ రోడ్డు చెంతనే చూసీ చూడనట్టు దింపేసే వారు. దీనిపై ప్రజల నుంచి నిరసన వ్యక్తమైంది. మరోపక్క ఈ చెత్త ఎగవేతకు మున్సిపాలిటీ కూడా తరచూ రూ.5 లక్షల చొప్పున బిల్లులు పెడుతూండటంపై కౌన్సిల్‌ నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో మున్సిపాలిటీ చేసే ఈ స్వీయ తప్పిదానికి తెర పడింది. ఇప్పుడు బైపాస్‌ రోడ్డు సువిశాలమైన సీసీ రోడ్డుగా అభివృద్ధి చెందిన తరువాత కూడా కొందరు రాత్రి సమయాల్లో వేస్తున్న చెత్త వల్ల అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వేస్ట్‌ ప్రాసెసింగ్‌ ప్లాంట్‌తోనైనా తెర పడేనా?

మున్సిపల్‌ డంపింగ్‌ యార్డులో 70 సెంట్ల భూమిలో రూ.3 కోట్లతో నిర్మిస్తున్న వేస్ట్‌ ప్రాసెసింగ్‌ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి, చెత్త సమస్యకు కొంత పరిష్కారం చూపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ ప్లాంట్‌ అందుబాటులోకి వచ్చిన తర్వాత బైపాస్‌ రోడ్డు చెంత చెత్త పోసే వారిలో మార్పు రావాలని పట్టణ ప్రజలతో పాటు మున్సిపల్‌ అధికారులు ఆశిస్తున్నారు.

రోడ్ల చెంతన వ్యాపారం చేస్తున్న కొంత మంది తమ చెత్తను రోజూ కంపోస్టు యార్డులో పోసినా ఫర్వాలేదు. లేదా వ్యాపారాలు చేసిన చోటే ఉంచేస్తే మర్నాడు పారిశుధ్య సిబ్బంది ఆ చెత్తను వాహనాల్లో తరలించే వీలుంటుంది. కానీ, అలా కాకుండా బైపాస్‌ రోడ్డును డస్ట్‌బిన్‌లా మార్చేస్తూండటాన్ని మున్సిపల్‌ అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు.

బైపాస్‌ రోడ్డు చెంత చెత్తను తొలగిస్తాం



బైపాస్‌ రోడ్డు చెంతన పేరుకుపోయిన కొబ్బరి బొండాలు, ఇతర చెత్త మూటలను పూర్తిగా తొలగించే ఏర్పాట్లు చేస్తున్నాం. అలా చెత్త పోస్తున్న వారిని గుర్తించి చర్యలు చేపట్టనున్నాం. ప్రస్తుతం మరీ దుర్గంధంగా ఉన్న చెత్తను తొలగించి, ఇక నుంచి చెత్త వేయకుండా నిఘా పెట్టాలనుకుంటున్నాం. రూ.3 కోట్లతో నిర్మిస్తున్న వేస్ట్‌ ప్రాసెసింగ్‌ ప్లాంట్‌ అందుబాటులోకి వచ్చాక ఇలాంటి అసౌకర్యాలను పూర్తిగా అడ్డుకుంటాం.

– ఒమ్మి అయ్యప్ప నాయుడు, మున్సిపల్‌ కమిషనర్‌, అమలాపురం

‘జగనన్న సురక్ష’తో అర్హులందరికీ న్యాయం

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌ కుమార్‌
- భైరవపాలెంలో పలువురికి ఉచితంగా ధ్రువపత్రాల పంపిణీ

ఐ.పోలవరం: అర్హులై ఉండి, ఏ ఒక్కరూ లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదన్న ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌ కుమార్‌ అన్నారు. ఐ.పోలవరం మండలం భైరవపాలెం సచివాలయం వద్ద గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సాంకేతిక, ఇతర కారణాలతో పథకాలు పొందని వారికి జగనన్న సురక్ష ద్వారా ప్రభుత్వం న్యాయం చేస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా పలువురికి ఉచితంగా వివిధ ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ పెమ్మాడి భవాని, పెమ్మాడి బాబూరావు, ఢిల్లీ నారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ పిన్నంరాజు వెంకటపతిరాజు, ఎంపీటీసీ సభ్యులు కాలాడి నూకరత్నం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి వివిధ ధ్రువపత్రాలు అందజేశారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

భైరవపాలెంలో ఎమ్మెల్యే పొన్నాడ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కార్పొరేట్‌ సోషల్‌ రెస్పాన్సిబిలిటీ నిధులు రూ.56 లక్షలతో నిర్మించిన వాటర్‌ ట్యాంక్‌ను, రిలయన్స్‌ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

అర్హులందరికీ సంక్షేమమే లక్ష్యం

ముమ్మిడివరం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకే సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారని జెడ్పీటీసీ సభ్యుడు కె.శివశంకరరావు అన్నారు. చినకొత్తలంక, సీహెచ్‌ గున్నేపల్లి గ్రామ సచివాలయాల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. చినకొత్తలంకలో 1,520 మందికి, సీహెచ్‌ గున్నేపల్లిలో 811 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పొత్తూరి ఉమారాణి, విత్తనాల నాగ సుబ్రహమణ్యేశ్వరావు, ఎంపీడీఓ జె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

ఉప్పలగుప్తం: జగనన్న సురక్షతో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు అన్నారు. ఉప్పలగుప్తం సచివాలయం–1, చినగాడవిల్లి, పెదగాడవిల్లి సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉప్పలగుప్తంలో సర్పంచ్‌ కడిమి చిన్నవరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఉప్పలగుప్తంలో 1,298, చినగాడవిల్లిలో 1,148 మంది లబ్ధిదారులకు వివిధ ధ్రువపత్రాలు అందజేశామని ఎంపీడీఓ కేఏస్‌ గౌరీకుమారి, తహసీల్దార్‌ జె.వెంకటేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్‌ మోకా శ్రీనివాస్‌, ఎంపీటీసీ సభ్యులు చిక్కం త్రినాథ, తాళ్ల నరసాయమ్మ, రాష్ట్ర కాపు కార్పొరేషన్‌ డైరెక్టర్‌ చీకట్ల కిషోర్‌, మోటూరి సత్యంకాపు, గృహ సారథుల కన్వీనర్‌ కోటుంలోవరాజు తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం సంక్షేమం

తాళ్లరేవు: ప్రజలకు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా నూరు శాతం సంక్షేమం అందుతుందని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. సుంకరపాలెం పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్‌ ఎస్‌.పోతురాజు బృందం ఆధ్వర్యాన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 540 మందికి పలు సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశారు. గ్రామానికి చెందిన పలివెల వంశీ కుటుంబానికి ఏడు సర్టిఫికెట్లు అందజేయడం విశేషం. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్‌, ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీనివాస్‌, ఉప సర్పంచ్‌ చింతాకుల శ్రీనివాస్‌, సచివాలయాల మండల కన్వీనర్‌ దున్నా శ్రీకాంత్‌, ఈఓ పీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి, కార్యదర్శి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



భైరవపాలెంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

జగనన్న హయాం.. సంక్షేమ రాజ్యం



కొప్పిగుంటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

కాట్రేనికోన: రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల లబ్ధి అందించడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సంక్షేమ రాజ్యాన్ని తలపిస్తోందని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ అన్నారు. కొప్పిగుంటలో సర్పంచ్‌ కముజు వెంకటలక్ష్మి, శ్రీనివాసరావు, వనచర్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే పొన్నాడ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హత ఉండి సంక్షేమ ఫలాలు అందని వారి వివరాలను తక్షణమే వలంటీర్ల ద్వారా నమోదు చేయిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలెపు లక్ష్మీ ధర్మారావు, జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ ట్యాంకు ప్రారంభం

గెద్దనపల్లి పంచాయతీ అడ్డపుంత గ్రామంలో సీఎస్‌ఆర్‌ నిధులతో నిర్మించిన వాటర్‌ ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ కాశి హనుమంతరావు, వైఎస్సార్‌ సీపీ వాణిజ్య విభాగం జిల్లా చైర్మన్‌ సంసాని నాగేశ్వరరావు, ఎంపీటీసీ మోత రామల తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ

ఐ.పోలవరం: కేశనకుర్రు పీహెచ్‌సీని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్‌ దుర్గారావుదొర గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై వైద్యులు ఆదిత్య పవన్‌, డి.శివ గాయత్రిలను అడిగి తెలుసుకొన్నారు. రోగులకు వైద్యం ఏవిధంగా అందిస్తున్నారో తెలుసుకుని, డెలివరీ రూమ్‌, ఓపీ, వార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రికార్డులు, ఆన్‌లైన్‌ రిపోర్టులు తనిఖీ చేశారు. పీహెచ్‌సీ ఉప కేంద్రాలైన మురమళ్ల, పశువుల్లంక, కేశనకుర్రు గ్రామాల్లో కూడా డీఎంహెచ్‌ఓ పర్యటించారు. ఏఎన్‌ఎంల వద్ద గర్భిణుల నమోదు, చిన్నపిల్లల వ్యాధి నిరోధక టీకాలు, ఇతర సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు



ప్రజలకు సంక్షేమ పథకాల పత్రాలు అందిస్తున్న డాక్టర్‌ శ్రీకాంత్‌

అమలాపురం రూరల్‌: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగేళ్ల కాలంలో ప్రతి ఇంటికీ వివిధ సంక్షేమ పథకాలు అందజేసిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ తనయుడు డాక్టర్‌ శ్రీకాంత్‌ అన్నారు. సమనసలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. ఏదైనా కారణంతో అర్హత ఉండి, ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే వారందరికీ వాటిని అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారని అన్నారు. అధికారులు గ్రామంలో ప్రజల వద్దకే వచ్చి సమస్య పరిష్కరించి, సంక్షేమ పథకాలు అందిస్తారని తెలిపారు. ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్‌, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, బీసీ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ కరేళ్ల రమేష్‌బాబు, మండల కో ఆప్షన్‌ సభ్యుడు ముసలి స్వర్ణన్‌రాజు, ఎంపీటీసీ సభ్యులు ఊడం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జయేంద్ర సరస్వతి జయంతి

అమలాపురం టౌన్‌: స్థానిక శ్రీ కామాక్షీ పీఠం మహా సంస్థానంలో కంచి కామకోటి సర్వజ్ఞ పీఠాధిపతి జయేంద్ర సరస్వతి మహాస్వామి 88వ జయంతి గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ కామాక్షీ పీఠాధిపతి కామేశ మహర్షి ఆధ్వర్యాన పీఠంలోని జయేంద్ర సరస్వతి చిత్రపటాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమానికి వచ్చిన భక్తులకు కామేశ మహర్షి ఆశీస్సులు అందజేశారు.

రెండు మోటార్‌ సైకిళ్లు ఢీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు

అమలాపురం టౌన్‌: పేరూరు వై.జంక్షన్‌ సమీపాన 216 జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. రెండు మోటార్‌ సైకిళ్లు ఎదురెదురుగా బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన ముగ్గురినీ స్థానికులు దగ్గరలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అమలాపురానికి చెందిన సాయిపవన్‌ను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. గాయపడిన మిగిలిన ఇద్దరిలో ఒకరిది అల్లవరం మండలం బోడసకుర్రు కాగా, మరొకరు అమలాపురానికి చెందిన వారని తెలిసింది.

యువకుడికి తీవ్ర గాయాలు

యానాం: దరియాలతిప్ప రోడ్డులో గురువారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాఫిక్‌ ఎస్సై పువ్వల వీరభద్రరావు కథనం ప్రకారం.. తాళ్లరేవు మండలం నీలపల్లి రామచంద్ర కాలనీకి చెందిన టి.లోవరాజు ఎల్‌అండ్‌టీ సంస్థలో పని చేస్తున్నాడు. విధులకు బైక్‌పై వెళ్తూండగా మార్గం మధ్యలో ఏవీఆర్‌ కెమికల్స్‌ వద్ద ఎదురుగా వస్తున్న సైకిల్‌ను తప్పించబోయి బోల్తా పడి, తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారక స్థితికి చేరుకున్న లోవరాజుకు యానాం ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీజీహెచ్‌కు తరలించారు.

సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్‌రామ్‌



అమలాపురంలో బాబూ జగ్జీవన్‌రామ్‌ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌



యానాంలో జగ్జీవన్‌రామ్‌ విగ్రహానికి నివాళులర్పించిన ఆర్‌ఏఓ మునిస్వామి, సీఐ షణ్ముగం తదితరులు

అమలాపురం టౌన్‌: మాజీ ఉప ప్రధానిగా బాబూ జగ్జీవన్‌రామ్‌ సంఘ సంస్కర్తగా నిలిచారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ అన్నారు. జగ్జీవన్‌రామ్‌ 37వ వర్ధంతి సందర్భంగా మాదిగల పొలిటికల్‌ జేఏసీ ఆధ్వర్యాన స్థానిక గడియారం స్తంభం సెంటరులో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత జగ్జీవన్‌రామ్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాబూజీకి ఇప్పటి వరకూ భారతరత్న అవార్డు ఇవ్వకపోవడం బాధాకరమని, ఆ మహానేతకు వెంటనే భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో మాదిగల పొలిటికల్‌ జేఏసీ ప్రతినిధులు యార్లగడ్డ రవీంద్ర, మడికి శ్రీరాములు, ఆకుమర్తి సత్యనారాయణ, లూటుకుర్తి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి

యానాం: స్థానిక ఫెర్రీ రోడ్డులో బాబూ జగ్జీవన్‌రామ్‌ విగ్రహానికి ప్రాంతీయ పరిపాలనా అధికారి (ఆర్‌ఏఓ) మునిస్వామి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే భీమ్‌నగర్‌ రోడ్డులోని జగజ్జీవన్‌రామ్‌ నిలువెత్తు కాంస్య విగ్రహానికి కూ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐ షణ్ముగం, పీఆర్‌ఏఓ కొల్లు ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

స్వామి, అమ్మవార్లకు భారీ సారె



స్వామివారికి సమర్పించిన భారీ సారెతో మహిళలు

అమలాపురం రూరల్‌: ఆషాఢ మాసం, స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణం సందర్భంగా బండారులంక బిళ్లవారివీధిలో వేంచేసియున్న పద్మావతీ అలమేలుమంగా సమేత వేంకటేశ్వర స్వామి వారిని గురువారం శాకాంబరులుగా అలంకరించారు. ఈ సందర్భంగా పాండురంగ విఠల భజన సమాజం ఆధ్వర్యాన గ్రామ మహిళలు సమయమంతుల భాగ్యలక్ష్మీ రత్నం (లత), భోజనపల్లి అమ్మాజీల పర్యవేక్షణలో అమ్మవార్లకు, స్వామివారికి సంప్రదాయబద్ధంగా పసుపు, కుంకుమ, మిఠాయిలు, పండ్లు, పువ్వులు, గాజులు, చీర, రవికెల వస్త్రాలతో భారీ సారె సమర్పించారు. తొలుత వీరభద్రస్వామి ఆలయం నుంచి సారెతో భారీ ఊరేగింపుగా వేంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. గోవింద నామోచ్చారణతో హారతులు ఇచ్చారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కార్మిక సమస్యలపై చర్చలు సఫలం

ముమ్మిడివరం: నగర పంచాయతీ కార్మికుల సమస్యలపై జరిగిన చర్చలు సఫలమయ్యాయి. ఇటీవల పారిశుధ్య కార్మికుల సమస్యలపై కమిషనర్‌ జి.లోవరాజుకు ఏపీ మున్సిపల్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో వారితో కమిషనర్‌, శానిటేషన్‌ సూపర్‌వైజర్‌ సత్యనారాయణరాజులు గురువారం కమిషనర్‌ చాంబర్‌లో చర్చలు జరిపారు. కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పనుల కేటాయింపులో అసమానతలు తొలగించాలని నాయకులు కోరారు. కార్మికులు క్రమశిక్షణతో నిబంధనలు పాటించి పని చేయాలని, ప్రజలకు నాణ్యమైన పారిశుధ్య సేవలు అందించాలని నిర్ణయించారు. ఈ చర్చల్లో ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు, జిల్లా, స్థానిక నాయకులు వనచర్ల విజయకుమార్‌, పలివెల రాంబాబు, మోర్త భార్గవరాజు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక వ్యతిరేక పనులపై న్యాయపోరాటానికి సిద్ధం

యానాం: నియోజకవర్గంలో తనకు సంబంధం లేకుండా నిర్వహిస్తున్న రిక్రియేషన్‌ క్లబ్‌కు సంబంధించి జరుగుతున్న ప్రచారాన్ని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌ అశోక్‌ గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. రాజకీయ అవసరాల కోసం తనపై ఎంపీ వైద్యలింగం తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత గత నవంబర్‌లో పుదుచ్చేరి అసెంబ్లీ ఎదుట రిక్రియేషన్‌ క్లబ్బులకు వ్యతిరేకంగా నిరాహార దీక్షకు దిగి, తన నిజాయతీ చాటుకున్నానని గుర్తు చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎటువంటి నిధులూ మంజూరు చేయకుండా నిర్లక్ష్యం చూపుతున్న ఎంపీ వైద్యలింగానికి ఇక్కడి ప్రజల సమస్యలు పట్టడం లేదని ఆరోపించారు. పుదుచ్చేరి రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న ఎన్‌డీఏ కూటమికి నేతృత్వం వహిస్తున్న సీఎం రంగసామి ప్రభుత్వంపై సైతం నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. యానాంలో డంపింగ్‌ యార్డు సమస్య పరిష్కారానికి, మద్యం డిస్టిలరీ స్థాపనకు, రిక్రియేషన్‌ క్లబ్బులు తదితర సామాజిక వ్యతిరేక పనులపై వైద్యలింగంతో కలిసి న్యాయపోరాటానికి సిద్ధమని ఎమ్మెల్యే అశోక్‌ స్పష్టం చేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

అమలాపురం టౌన్‌: పట్టణంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లకు చెందిన విద్యార్థులకు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు గురువారం పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. వీటిని పట్టణ చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ సమకూర్చారు. ఎస్సీ, బీసీ హాస్టళ్లలో ఈ పంపిణీ జరిగింది. కార్యక్రమంలో చాంబర్‌ కార్యదర్శి యెందూరి నాగేశ్వరరావు, కోశాధికారి కరెళ్ల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, చాంబర్‌ ప్రతినిధులు

ఆరోగ్యకరమైన నారుతో అధిక దిగుబడులు



అమలాపురం కామనగరువులో నారుమళ్లు

అమలాపురం రూరల్‌: కాలువలకు నీరు రావడంతో పాటు.. ప్రస్తుతం వర్షాలు కురుస్తూ వాతావరణం అనుకూలంగా మారడంతో అన్నదాతలు ఖరీఫ్‌ వరి నారుమడులకు శ్రీకారం చుడుతున్నారు. అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు ఈ తరుణంలోనే ఆరోగ్యకరమైన నారు పెంచేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. నారుమడులు, కలుపు యాజమాన్యం, సస్యరక్షణ పద్ధతుల గురించి అమలాపురం వ్యవసాయ సబ్‌ డివిజన్‌ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ (ఏడీఏ) ఎంఏ షంషి వివరించారు.

నారుమడి తయారీ ఇలా..

నారుమడికి ఎంచుకున్న నేల సారవంతంగా ఉండాలి. ఇది పొలానికి ఎప్పుడూ మెరకలో ఉండాలి. వీలైనంత వరకూ పల్లపు ప్రాంతం ఎంచుకోరాదు. ఎకరం పొలానికి 3 సెంట్ల నారుమడి తయారు చేసుకోవాలి. పది పన్నెండు రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా దమ్ము, చదును చేసి, నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా గాడి తీసుకోవాలి. ఆఖరి దుక్కిలో వీలైనంత వరకూ బాగా చివికిన సేంద్రియ ఎరువులు వేసి కలియ దున్నుకోవాలి. కలుపు లేకుండా చూసుకోవాలి. దీంతో వేరు వ్యవస్థ దృఢంగా, నారు తీసేటప్పుడు తెగిపోకుండా ఉంటుంది.

విత్తన శుద్ధి

ఎకరం విస్తీర్ణానికి 15 కేజీల నాణ్యమైన విత్తనాలు సరిపోతాయి. విత్తే ముందు విధిగా విత్తన శుద్ధి చేయాలి. కిలో విత్తనానికి కార్బండిజమ్‌ 25 శాతం, మాంకోజెడ్‌ 50 శాతం మిశ్రమ శిలీంద్రనాశిని 2 గ్రాముల చొప్పున లీటరు నీటిలో కరిగించి విత్తనానికి పట్టించాలి. ఈ విత్తనాలను 36 గంటలు నానబెట్టి, 24 గంటలు మడి కట్టి, కోర వచ్చిన తరువాత సాయంత్రం పూట నారుమడి నిండా నీరు పెట్టి సెంటుకు 5 కిలోల చొప్పున వెదజల్లాలి. 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్‌ ఎరువులు దుక్కిలో వేయాలి. విత్తిన పది రోజులకు, 17 రోజులకు కార్బోఫ్యూరాన్‌ 3జీ గుళికలు సెంటుకు 160 గ్రాముల చొప్పున వేయాలి. లేదా మోనోక్రోటోఫాస్‌ 361 ఎస్‌ఎల్‌–16 మిల్లీలీటర్లు లేదా క్లోరోపైరిఫాస్‌ 20/ఇసి 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

నారుమడులు త్వరగా పూర్తి చేయాలి



మొన్నటి వరకూ ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉన్నందున నారు పోసుకోవడానికి రైతులు ఆలోచించారు. ప్రస్తుతం వాతావరణం చల్లబడి సాగుకు అనుకూలంగా ఉన్నందున రైతులు యుద్ధప్రాతిపదికన నారుమడులు వేసుకోవాలి. ఈ నెల 25వ తేదీలోగా నాట్లు పూర్తి చేయాలి. కోనసీమ ప్రాంతానికి అనుకూలమైన ఎంటీయూ–7029, 1064, 1061 వరి రకాలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. అయితే ఎంటీయూ–7029 (స్వర్ణ) రకం 80 శాతం మేర విస్తరించి ఉంది. ఈ రకం అధిక దిగుబడి ఇస్తుంది. కానీ అననుకూల పరిస్థితుల్లో చేను పడిపోతుంది. ఎంటీయూ–1318 రకం అననుకూల పరిస్థితుల్లో కూడా నిలబడి ఉంటుంది. స్వర్ణకు దీటుగా దిగుబడినిస్తుంది. ఈ రకం సాగు చేసుకోవడం మంచిది.

– ఎం.షంషి, ఏడీఏ, అమలాపురం సబ్‌ డివిజన్‌